


## - సహస్రాబ్దికి చేరువవుతున్న రామానుజ జయంతి -

# శ్రీమతే రామానుజాయ నమః



భారతీయుల్లో ఆధ్మాత్మిక ధర్మప్రవృత్తి పెరగడానికి ప్రధాన ధర్మాచార్యుల్లో శ్రీ రామానుజార్యులను ప్రధానంగా చెప్పుకోవాలి. ప్రజలను విష్ణుభక్తి పరా యణులుగా చేయడానికి, వైష్ణవత్వం స్థూలంగా ప్రజల్లో నాటుకోవడానికీ రామానుజుల వారే కారణభూతులు. ఆదిశంకరభగవత్పాతులవలె వారూ దక్షిణా పథంలోనే జన్మించారు. ఆ సేతుహిమాచలపర్వతమూ విష్ణుభావనా పరులుగా విష్ణుభక్తులుగా ప్రజలను తీర్చిదిద్దారు. దక్షిణ భారతంలో నూటికీ 99శాతం వైశ్యులు విష్ణు ఆరాధకులే! చెన్నపట్నం సమీ పంలోగల శ్రీ పెరంబదూర్‌లో వారు జన్మించారు. అక్కడవారు జన్మించిన స్థలంలో ఓ గొప్ప రామానుజల ఆలయాన్ని నిర్మించి, ఈనాటికినీ నిత్యపూజలు చేస్తున్నారు. ఆ శ్రీ పెరంబదూర్ గ్రామంలోనే శ్రీరంగనాధునిని పెండ్లి యాడిన ఆండాళ్ తల్లి కూడా జన్మించింది.

ఆమె తన పాశురాలతో శ్రీ రంగనాధుణ్ణి ఆరాధనా భావంతో ప్రేమించి, పెండ్లియాడిన చరితమును సాహితీ సమరాంగణా చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు వారు 'ఆముక్త మాల్యద'నే గ్రంధాన్ని రచించారు. ధనుర్మాసం 30 రోజులూ, తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీవారి సుప్రభాతానికి మారుగా శ్రీ ఆండాళ్ రచించిన పాశురాలనే గానం చేస్తారు. శ్రీ విష్ణు స్వరూపుడైన శ్రీ కృష్ణుణ్ణి అంత భక్తి అనంతమైన ప్రేమతో సంకీర్తనం చేసి, సమ్మోహన హృదయంతో రోజుకో పాశురాన్నీ పూలదండతో పంపి, మెప్పించి, 30వ రోజు భోగినాడు శ్రీరంగ నాధుణ్ణి పరిణయమాడిన పరమభక్తురాలు ఆండాళ్. ఆమె శ్రీ పెరంబూర్‌లోని ఆలయ అర్చకులు, విష్ణు భక్తి పరుడైన విష్ణుదత్తుని అనంగు కుమార్తె. క్షేత్ర ఔనత్యాన్ని చెప్పడానికీ గోదాదేవి వృత్తాంతాన్ని ప్రస్తుతించవలసి వచ్చినది.

రామానుజాచార్యుల వారు శ్రీ పెరంబూర్‌లో జన్మించిననూ ఎక్కువగా వారు చెన్నపట్నం తిరువళిక్కేణిలోని శ్రీ పార్ధసారధి స్వామి సేవ చేసినట్టు, ప్రామాణికంగా చెప్పుకోవడానికి ఆ ఆలయ ప్రాంగణంలో రామానుజలవారికి ఒక ఉపాలయం ఉన్నది. ఆయన అనేక విష్ణు క్షేత్రాలను సందర్శించి, అక్కడ ఆచార్య పీఠాలను నెలకొల్పారు. అలా వారు దేశం మొత్తంలో ఉన్న 108 వైష్ణవ క్షేత్రాలను సందర్శించారు. అర్చనా విధాలను, కైంకర్యాలు రూపొందించారు. విశ్వవిఖ్యాతి చెందిన తిరుమల వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వైఖానస ఆగమ, ఆరాధనా సేవలన్నిటినీ శ్రీ రామానుజుల వారు నిర్దేశించినవే! సేవా పేరుల్లో తమిళంలో ఉండడానికి రామానుజాచార్యులే ప్రధాన కారకులు. ఇప్పటికీ ఆ పూజా విధానాలే కొనసాగుతున్నాయ్.

మరోగొప్ప విశేషం- తిరుమల శ్రీనివాసుడున్న ఏడు కొండలూ ఆదిశేషుని పడగలనీ, ఎంతో మహత్తరమైనవనీ, ఆయన పాదాచార్యునిగా పాదములతో నడవడం అపచారమనీ- ఆయన మోకాళ్ళతో నడచి వెళ్ళి శ్రీ వెంకటేశ్వరుణ్ణి దర్శించుకున్నారని ఆళ్వార్లు చెబుతున్న సత్యం. వైష్ణవ భక్తి ప్రాచుర్యాన్ని విశదమొనరుస్తూ ఆళ్వారు లెన్నో గ్రంధాలను వ్రాసారు. ముఖ్యంగా చెప్పుకోవలసిన మరో విశేషం శ్రీ వెంకటేశ్వర స్వామి స్వయం భువుగా ఎప్పుడు వెలసినది ఎవరూ చెప్పలేని విషయం. కానీ రామానుజుల వారు గ్రహించిన ఆ విగ్రహం శక్తి స్వరూపం అంటారు. విగ్రహం శిరః భాగం వెనుక నిడువైన కేశాలున్నవనీ, ఆ సాంప్ర దాయంలో జరిగే అర్చనా విధానాన్ని కేశవార్చనంగా (వేంకటేశ్వరా అర్చనంగా) మార్చారనీ వైఖానస పద్ధతిలోనే పూజలు జరగడానికీ పూజల పేర్లలో తమిళ పేర్లుండడానికి అదే కారణం.

రామానుజులు అచ్చ తెనుగు కుటుం బంలో పుట్టారనీ, ప్రాంతభాషగా ఉన్న తమిళం, దేశ భాష సంస్కృతంలో పండితులనీ ప్రతీతి. దేశంలో వైష్ణవభక్తి విస్తృతం కావ డానికి శ్రీ రామానుజాలవారే కారణం. అం దుకే వారిని ఆదిరామానుజ భగవత్పాదు లుగా అర్చిస్తున్నాం.



